



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 264

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 28 ఫిబ్రవరి 2024


# సంక్షేమ పాలన అందించాం

● రాజకీయాల్లో విశ్వనీయత ముఖ్యం ● చంద్రబాబుకు విశ్వసనీయత లేదు ● రేపటి నుంచి 45 రోజులపాటు కీలకం ● రూ.2 లక్షల 55 వేల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో జమ చేశాం ● ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి







**గుంటూరు,కలంకౌంటర్ :** ఏపీలో సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ జనం కంటే క్యాడర్ నే ముందుగా సిద్ధం చేసుకుంటున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి మంగళవారం మరో కీలక సమావేశం నిర్వహించారు. ఇప్పటికే క్యాడర్ తో ప్రాంతాల వారీగా సిద్దం సభలు నిర్వహిస్తున్న జగన్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 3 వేల మంది కీలక నేతలతో మరో సిద్ధం భేటీ నిర్వహించారు. ఇందులో వచ్చే ఎన్నికల్లో తిరిగి ఎలా గెలవాలన్న దానిపై వారికి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో 175కు 175 సీట్లు ఎలా సాధించాలన్న దానిపై మరోసారి ప్రధానంగా సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు.

**45 రోజులపాటు కీలకం :** అసెంబ్లీ ఎన్నికలకు అధికార వైఎస్సార్‌సీపీ సమాయత్తమైంది. మంగళగిరిలో మంగళవారం పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. 175 నియోజకవర్గాల నుంచి 2,500 మంది నేతల్ని ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. రేపటి నుంచి 45 రోజులపాటు కీలకం. మనం చేసిన మంచి పనులు, చేసే మంచిని ప్రజలకు చెప్పండి. రాజకీయాల్లో విశ్వనీయత ముఖ్యం. చంద్రబాబుకు విశ్వసనీయత లేదు. 2014లో చంద్రబాబు అది చేస్తాం ఇది చేస్తాం అంటూ హామీలిచ్చారు. సాధ్యపడని హామీలను కూడా మేనిఫెస్టోలో పెట్టారు. అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారు. చంద్రబాబు ఇచ్చిన దొంగ హామీలు నాకు ఇంకా గుర్తుంది. రైతు రుణాలు మాఫీ చేస్తానన్నాడు, బంగారం లోన్లు తీరుస్తానన్నాడు. సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేశాడు. అసలు అమలు సాధ్యం కాని హామీలు ఎలా ఇచ్చాడో చంద్రబాబుకే తెలియాలి. ఒక హామీ ఒక నాయకుడు ఇచ్చాడంటే దానికి విశ్వసనీయత ఉండాలి. తప్పుడు హామీలు ఎప్పుడు మనం ఇవ్వలేదు, ఇవ్వం కూడా. మనం ఏది ఇవ్వగలమో.. అది చెబుతున్నా

- 2లో

# 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2

● వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు
● రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో 5 లక్షల మందికి ఉద్యోగాలు
● వైరస్ భయాలన్నింటికీ హైదరాబాద్ ప్రపంచానికి ఆశాదీపం
● బయో ఏసియా సదస్సు 2024 లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,కలంకౌంటర్ :** త్వరలోనే హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రెండవ ఫేజ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైటెక్స్ లో హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ బయో ఏషియా 2024 సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ 2024 అవార్డుకు ఎంపికైన నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్.సెమెంజాను సీఎం అభినందించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి సెమెంజాకు అవార్డును అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'మూడు వందల ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తాం. లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజీలను ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. దీంతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్ లను ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోని అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుంది...' అన్నారు. కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలున్న పరిస్థితుల్లో హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న బయోఏషియా సదస్సు కీలకంగా మారిందని ముఖ్యమంత్రి అన్నారు. బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికి ఒక భరోసాగా నిలిచిందని అన్నారు. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని హైదరాబాద్ కలిగించిందని, ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్ లోనే ఉత్పత్తి అవుతోందని గుర్తు చేశారు. ఆరోగ్య భద్రత విషయంలో ప్రపంచంలోని అందరి సమస్యలు ఒకేలా ఉన్నాయని కోవిడ్ నిరూపించిందని, అయితే సమస్యల పరిష్కారాలను కూడా మనం కలిసికట్టుగానే

- 3లో

# చంద్రబాబుతో పలువురు ఆశావహుల భేటీ



**అమరావతి,కలంకౌంటర్ :** తెలుగుదేశం అధినేత చంద్రబాబును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో ఆయన తెదేపాలో చేరనున్నారు. పల్నాడు జిల్లా అభివృద్ధి కోసం మళ్లీ పోటీ చేయబోతున్నట్లు ఇప్పటికే శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా మళ్లీ ప్రజల ముందుకొస్తున్నానని తెలిపారు. ఇదే విషయమై భేటీలో ఎంపీ చర్చించినట్లు సమాచారం. అలాగే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబును తన నివాసంలో పలువురు ఆశావహులు కలుస్తున్నారు. వీరిలో తొలి జాబితాతో సీటు కోల్పోయిన వారితో పాటు ప్రకటించని స్థానాల ఆశావహులు ఉన్నారు. స్థానాలు కోల్పోయిన నేతలను బుజ్జగించి రాజకీయ భవిష్యత్తుకు చంద్రబాబు హామీ ఇస్తున్నారు. కడప పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అధినేత నివాసానికి వచ్చారు. వచ్చే ఎన్నికల్లో కడప లోక్‌సభ టికెట్‌ను శ్రీనివాసులు ఆశిస్తున్నారు. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ చంద్రబాబుతో భేటీ అయ్యారు. తంబళ్లపల్లి నియోజకవర్గాన్ని ఈసారి జయ చంద్రారెడ్డికి కేటాయించారు. అలాగే అనంతపురం లోక్‌సభ స్థానం ఆశిస్తున్న జేసీ పవన్ రెడ్డి చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు. అనంతపురం నుంచి పోటీ చేయాల్సిందిగా ఇప్పటికే బీకే పార్థసారథికి చంద్రబాబు సూచించిన సంగతి తెలిసిందే. తొలి జాబితాలో చోటు దక్కని ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి సైతం చంద్రబాబుతో సమావేశమయ్యారు.

# ఏపీలో 8 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తున్నట్టు సర్క్యులర్ జారీ




**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నారు. వైసీపీ, టీడీపీ నుంచి అందిన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్ తమ్మినేని సీతారాం 8 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో, నేడు అధికారిక సర్క్యులర్ జారీ అయింది. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేశ్, మద్దాలి గిరిధర్, కరణం బలరాంలను అనర్హులుగా ప్రకటిస్తూ విధాన పరిషత్ కార్యదర్శి రామాచార్యులు సర్క్యులర్ ఇచ్చారు. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలిచిన వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేశ్, మద్దాలి గిరిధర్, కరణం బలరాం వైసీపీకి దగ్గరయ్యారు. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో కోటంరెడ్డి, ఆనం, మేకపాటి, ఉండవల్లి శ్రీదేవి టీడీపీతో జట్టుకట్టారు.

# పార్టీకి కార్యకర్తలే వెన్నుముక : హెూంమంత్రి తానేటి వనిత



**ద్వారకా తిరుమల/యర్నగూడెం,కలంకౌంటర్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే నిజమైన బలం, వారే పార్టీకీ వెన్నెముక అని రాష్ట్ర హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత బలమైన సంకేతాలు పంపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో 175 కి 175 స్థానాలు గెలవాలనే లక్ష్యంతో గోపాలపురం నియోజకవర్గం ఇన్చార్జ్ గా హెూంమంత్రి తానేటి వనితను నియమించారు. గత నెల 25న నియోజక వర్గంలో ద్వారకా తిరుమల మండలం తొలి పర్యటన నుండి సోమవారం నల్లజర్ల మండలం పర్యటన వరకూ నాయకులు, కార్యకర్తలతో భేటీలు, సమావేశాలు నిర్వహించారు. పార్టీ కి కొంతకాలంగా దూరంగా ఉంటున్న కొద్దిమంది పార్టీ నాయకులను కలిసి వారిని తిరిగి యాక్టివ్ అయ్యేలా చేశారు. నాయకులు కాకుండా కార్యకర్తలను సైతం దగ్గరకు చెరదీసారు. ఈ క్రమంలో ద్వారకా తిరుమల మండలం తిమ్మాపురం పర్యటనలో గ్రామానికి చెందిన బయ్యరపు ఏడుకొండలు (తండ్రి : పెద్ద దుర్గయ్య) అనే కార్యకర్త ఇటీవల మృతి చెందిన విషయం హెూంమంత్రి దృష్టికి తీసుకురాగా.. వెంటనే ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చాను. చిన్నస్థాయి కార్యకర్త ఇంటికి కూడా హెూం మంత్రి వచ్చి పరామర్శించడం, వారికి భరోసా ఇవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## తెనాలిలో రామాచార్యులు విగ్రహావిష్కరణ



**తెనాలి,కలంకౌంటర్ :** బిజెపి అగ్రనేత, అర్చక ఉద్యమ పితామహుడు దివంగత తమిరిశ రామాచార్యులు కాంస్య విగ్రహావిష్కరణ తెనాలి ట్యాంక్ బండ్ పై ఆయన తనయుడు డాక్టర్ అనంతాచార్యులు నేతృత్వంలో మంగళవారం వైభవంగా జరిగింది. త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి రామాచార్యులు విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, మేడూరి శ్రీనివాసమూర్తి, డాక్టర్ దక్షిణామూర్తి, పార్టీ నేతలు స్వరూపరాణి, పాటిబండ్ల రామకృష్ణ, వనమా పూర్ణ చంద్రరావు, నరేంద్ర కుమార్, అర్చక సంఘం నేత ఆత్రేయ బాబు తదితరులు ప్రసంగించారు. రామాచార్యులు నీతి నిజాయితీ, వ్యక్తిత్వం కల నిరాడంబరుడు అని వక్తలు కొనియాడారు.

## పెదప్రోలులో28 29 తేదీలలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం...



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలోని శ్రీ దుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామి వారి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ,నవగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 28 29 తేదీలలో నిర్వహించ నున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 28వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనము, మండపారాధన, వాస్తు పూజ, వాస్తు హెూమము, స్వామివారి విగ్రహాలకు క్షీరాది వాసము, జలాధివాసము చేయబడును. సాయంత్రం ఐదు గంటలకు దీక్ష హెూమములు స్వామివారి విగ్రహాలకు ధాన్యాదివానము, నీరాజనం మంత్రపుష్పములు జరుగును. 29వ తేదీన గురువారం ఉదయం ఏడు గంటలకు మండప పూజ, దీక్ష హెూమములు, ప్రాణ ప్రతిష్ట మరియు పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగును.. అనంతరం అన్న సమారాధన జరుగునని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు..

## కిశోర బాలికల అవగాహన సదస్సు



**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం తిరువూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగింది. బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిణి ఉమాదేవి, డీసీపీఓ జాన్సన్, సీడీపీవో సత్యవతి, ఏసిడిపీవో ఝాన్సీ అవగాహన కల్పించారు.

## కానూరులో నేత్ర శాస్త్ర చికిత్సలు



**మచిలీపట్నం టౌన్ ,కలంకౌంటర్ :** బందరు మండలం కానూరు గ్రామంలో మంగళవారం శ్రీ సత్య సాయి గ్రామీణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర పరీక్షలు నిర్వహించి ముగ్గురికి శస్త్ర చికిత్స అవసరమని డా.భానుమూర్తి గుర్తించారు. వారికి శస్త్ర చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు కొట్టే నాగమణి, పోలిశెట్టి కోమలాదేవి పాల్గొన్నారు. డా. భానుమూర్తి, సేవాదళ్ సభ్యులు శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులు ఉండాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పి ఆంజనేయ కుమార్ ఆకాంక్షించారు.

# ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- **నగర జనసేన అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్**



**గుంటూరు,కలంకౌంటర్ :** నగరంలో కలుషిత నీరు తాగి ఇప్పటికి ఐదుగురు మరణించారని , ఎంతమంది చనిపోతే పాలకులు , అధికారులు మొద్దునిద్ర వీడతారని నగర జనసేన పార్టీ అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల , పాలకుల ఉదాసీనతకు ఇంకెంతమంది బలవ్వాలంటూ ఆయన ధ్వజమెత్తారు. సోమవారం వాంతులు , విరేచనాలతో మృతి చెందిన చిన్నారి సరిత కుటుంబాన్ని ఆయన ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియాతో చిన్నారి సరితా చనిపోతే ఆ పేద కుటుంబాన్ని పరామర్శించటానికి కమీషనర్ కు , మేయర్ కు , ఎమ్మెల్యేలకు , మంత్రి రజనీకి కాస్త సమయం కూడా లేదా అంటూ దుయ్యబట్టారు. నగరంలో డయేరియా విజృంభిస్తోందని ప్రతిపక్షాలు ఎంతగా మొత్తుకుంటున్నా నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం , వైద్య , ఆరోగ్య శాఖలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇవి డయేరియా కేసులు కాదంటూ సమస్యని పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారే కానీ సమస్యను పరిష్కరిద్దామన్న ఆలోచనే పాలకులకు లేకపోవడం శోచనీయమన్నారు. ఒకవేళ డయేరియా కాకపోయినా ప్రజలు మృత్యువాత పడుతున్నారు కదా సమస్యేమిటో కనుక్కొని పరిష్కారం చూపాలి కదా అని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ 1400 కోట్లుగా ఉన్నా ప్రజలకు తాగేందుకు గుక్కెడు రక్షిత మంచినీరు ఇవ్వలేని స్థితిలో నగరపాలక సంస్థ కమీషనర్ , మేయర్ , పాలకవర్గం ఉంది అంటే అంతకన్నా సిగ్గుచేటు ఇంకోటి ఉండదని నేరేళ్ళ సురేష్ విమర్శించారు. వైసీపీ నేతలకు ప్రచారయావపై ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమం పై లేదని జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి విమర్శించారు. వైద్య ఆరోగ్య శాఖామంత్రి రజినీ ఇలాఖాలోనే ప్రజలకు ఆరోగ్య భద్రత లేక ప్రాణాలు పోతుంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు పెట్టామని గొప్పలు చెప్పుకోవడం కాదని వాటి నిర్వహణను కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. మురికివాడల్లో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించాలని నగర కమీషనర్ ను ఆయన కోరారు. డయేరియా తో మరణించిన చిన్నారి సరితా కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డయేరియాతో మరో మరణం సంభవించకుండా పాలకులు , అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి చర్యలు తీసుకోవాలని ఆళ్ళ హరి కోరారు. బాధితులను పరామర్శించిన వారిలో రెల్లి యువ నేత సోమి ఉదయ్ కుమార్ , చెన్నం శ్రీకాంత్ , పులిగడ్డ గోపి ,గడ్డం రోశయ్య , సాయి తదితరులున్నారు.

# వలసలు నిజమేనా?

- **నాయకుని మెప్పు కోసం ఈ వలసల?** • **ప్రజల్లో హాస్యాన్ని పండిస్తున్న చేరికలు**
- **పలు విమర్శలకు వెళ్లి పార్టీ పరువుకి భంగం కలిగే పరిస్థితి**

**పిట్టలవానిపాలెం,(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** బాపట్ల అసంబ్లీ అభ్యర్థిగా వేగేసిన నరేంద్ర ను ప్రకటించారు చంద్రబాబు. దీనితో టీడీపీ లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. కొందరు స్వతహాగా అధికార పార్టీ లోఇమడలేక టీడీపీ గూటికి చేరుతున్నారు. అయితే ఎన్నికల సమయం ఆసన్నాం అవటం లో కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు తమ బుర్రల కు పదును పెట్టారు. అవసరం.... అవకాశం అనే నినాదం తో నాయకుని వద్ద మెప్పు పొందటానికి ఇద్దరు పార్టీ లో చేరితే పాత మొహాలు20 మంది ప్రక్కనే నిలబెట్టి వందలాది మంది పార్టీ లో చేరిక అంటూ హడావుడి చేస్తున్నారు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో సదరు నాయకులకు కాసుల పంట కూడా పండుతుంది అని గుసగుసలు వినబడుతున్నాయి. దీని వలన పార్టీ పరువుకి భంగం కలగటమే కాక ఉన్న టీడీపీ నాయకులు అసహనానికి గురి అవుతున్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నాయకులను ద్వితీత శ్రేణి వారు ప్రోత్సహించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. వలసలు అనేవి తూ తూ మంత్రం వారు గోడ మీద పిల్లులు అని అధికార పార్టీ కొట్టి పరుస్తుంది. ఇంకో పక్క వీరు పార్టీగ్5వీడితే ఉన్న దరిద్రం పోయి నిజమైన వైసీపీ కార్యకర్తలు పార్టీ లో ఉంటారు అని అధికార పార్టీ నాయకుడు ఆనందం లో ఉన్నారు. ఈ వలస నాయకులు అసలు నిలకడగా ఉంటారా?ఓటు ఏ పార్టీ కి వేస్తారు అంటూ వ్యంగ్యంగా ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఈ వలసల వల్ల పార్టీ బాధ్యులని ద్వితీత శ్రేణి నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారు అంటూ విమర్శలు కూడా కోకొల్లలు గా వినబడుతున్నాయి. ఏది ఏమైనా టికెట్ వొచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదు. రణరంగం ముందు ఉంది అంటూ విశ్లేషకులు హితవు పలుకుతూ జాగ్రత్త పడమంటున్నారు.

# గుడివాడ రూరల్ మండలంలో గుడివాడ టిడిపి ఇంచార్జ్ & అభ్యర్థి వెనిగండ్ల రాము పర్యటన



**గుడివాడ,కలంకౌంటర్ :** బిళ్ళపాడు గ్రామంలో బాబు ష్యురిటీ భవిష్యత్తు కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించిన రాము బిళ్ళపాడు సెంటర్లో టిడిపి జెండా ఎగరవేసి- ఇంటికి టిడిపి కార్యక్రమం చేపట్టిన రాము. గజమాలలతో రాము ఘన స్వాగతం పలికిన టిడిపి జనసేన పార్టీల నాయకులు. ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటూ - సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసిన రాము. భారతరత్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, దేవాలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన రాము వీధి వీధినా మహిళా సోదరీమణులు మంగళహారతులతో రాముకు స్వాగతం పలుకగా, విజయోస్తు అంటూ రామును ఆశీర్వదిస్తున్న రైతులు, గ్రామ పెద్దలు. వెనిగంట్ల రాము పాయింట్స్ కుప్పం సభలో టీడీపీ అధినేత చంద్రబాబును ఉద్దేశించి సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయన మానసిక వైకల్యానికి నిదర్శనం. ప్రజలు తనకు, తన పార్టీకి చరమగీతం పాడబోతున్నారని తెలిసే జగన్ నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారు. టిడిపి జనసేన కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రత్యేక విజన్ తో గుడివాడ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. వార్డు గ్రామ ,పర్యటనల్లో తనకు మద్దతు తెలుపుతూ, ఆత్మీయత చూపుతున్న ప్రజానీకానికి ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు,అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి,రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, సీనియర్ టిడిపి నాయకులు గోర్జి సత్యనారాయణ ,లింగం ప్రసాద్ ,పార్టీ నాయకులు ముల్లపూడి రమేష్ చౌదరి, వసంతవాడ దుర్గారావు ,శొంఠి రామకృష్ణ,అందుగొళ్ళ యేసు పాదం తమ్మిశెట్టి కనకారావు ,నిమ్మగడ్డ సత్యసాయి,గడ్డం ప్రకాష్ దాస్, గుడివాడ జోన్స్,మెరుగు మోజేష్, కాగిత నరేంద్ర , ఇమ్మానుయేలు దేవేంద్రుడు ,గోవాడ శివ నేరుసు కాశీ ,షణ్ముఖ ,రెడ్డి అప్పారావు , నూర్ ,గుడివాడ మండల టీడీపీ నాయకులు వీరవరపు వంశీ ,కైలా రంజిత్ ,గుమ్మడి రాజేష్ , సూరపనేని చిన్నబాబు,డొక్కుమాల అనంత్ కుమార్,ముద్రాల కనకదుర్గయ్య,చీకటి శేషగిరిరావు , సురగాని సూరిబాబు,గండికోట గోపికృష్ణ, జనసేనా ఇంటూరి గజేంద్ర ,బిల్లపాడు గ్రామ టీడీపీ నాయకులుకర్రె వెంకటగిరి , అవ్వారు రాంపండు ,వేములపల్లి భవాని ,మెండు జోజి బాబు , గుజ్జర్లమోడి వీర నాంచారయ్య, ఆరేపల్లి నాంచారమ్మ,వంగలపాటి అశోక్ ,గొరిపర్తినాగేశ్వరరావు ,పంది.నాగార్జున,యడవల్లి రమణ, డెరంగుల చేన్నయ్య,షేక్. మున్నా,నక్క సతీష్, నారగని వంశి, గుడివాడ నియోజకవర్గ టిడిపి జనసేన ముఖ్య నాయకులు, తెలుగు మహిళ, తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, ఐ.టీడీపీ,టీడీపీ జనసేన అనుబంధ విభాగాల నేతలు,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాలకు శ్రీశైలం ఆహ్వానం



**విశాఖ,కలంకౌంటర్ :** శివరాత్రి సందర్భంగా శ్రీశైలం దేవస్థానం చేపట్టే బ్రహ్మోత్సవాలకు విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను ఆహ్వానించారు. ఈ మేరకు శ్రీశైలం పండితులు, అధికారులు మంగళవారం పీఠాన్ని సందర్శించారు. బ్రహ్మోత్సవాలలో పాల్గొని శివ భక్తులకు అనుగ్రహ భాషణం అందించాలని కోరారు. శ్రీశైలం దేవస్థానం ఘనాపాటి గంటి రాధాకృష్ణ తదితర పండితులు పీఠాధిపతులను కలిసిన వారిలో ఉన్నారు!

# కుప్పంలో చంద్రబాబు ఓడిపోవడం పక్కా: గణాంకాలతో విజయసాయిరెడ్డి వివరణ

- **2004లో కుప్పంలో చంద్రబాబుకు 70 శాతం ఓట్ షేర్ వచ్చిందన్న విజయసాయి**
- **2019కి 55.19 శాతానికి దిగజారిందని వెల్లడి**
- **ఈసారి సొంత సీటును కూడా కాపాడుకోలేరని ఎద్దేవా**

**గుంటూరు,కలంకౌంటర్ :** కుప్పం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఓటమి వెరీ క్లియర్ అని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి జోస్యం చెప్పారు. 2004లో చంద్రబాబుకు 70 శాతం ఓట్ షేర్ వచ్చిందని... 2014లో అది 62.5 శాతానికి పడిపోయిందని... 2019లో మరింత దిగజారి 55.19 శాతానికి పరిమితమయిందని తెలిపారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు కేవలం 30,722 ఓట్ల మెజార్టీతో గెలుపొందారని చెప్పారు. 2024 ఎన్నికల్లో సొంత సీటును కూడా చంద్రబాబు కాపాడుకోలేరని అన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం అవుతారనే విషయాన్ని మర్చిపోవాలని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు.

# వైద్య ఆరోగ్య శాఖలో మరో 189 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- **కాంట్రాక్టు పద్ధతిలో 102 మెడికల్ ఆఫీసర్లు, 87 స్టాఫ్ నర్సుల పోస్టుల నియామకం**

**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో నిరంతర నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఎప్పుడు ఏర్పడిన ఖాళీలను అప్పటికప్పుడే భర్తీ చేయాలని ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చిన నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. తాజాగా నేషనల్ హెల్త్ మిషన్ కింద 189 పోస్టుల్ని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు (అర్బన్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) లలో ఖాళీగా వున్న 102 మెడికల్ ఆఫీసర్లు, 87 స్టాఫ్ నర్సుల పోస్టుల్ని భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందుకు సంబంధించిన అర్హతా ప్రమాణాలు, సవివరమైన మార్గదర్శకాలు 1) https://apmsrb.ap.gov.in/msrb, 2) https://dme.ap.nic.in, 3)https://hmfw.ap.gov.in, 4) https://cfw.ap.nic.in వెబ్ సైట్లలో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తకలిగిన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ నుండి మార్చి 10వ తేదీలోపు https://apmsrb.ap.gov.in/msrb వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా తమ దరఖాస్తులు పెట్టుకోవాలని ఆయన సూచించారు.

# సంక్షేమ పాలన అందించాం





(మొదటి పేజీ తరువాయి)

. 99 శాతం హామీలన్నింటిని నెరవేర్చాం. దేశంలో విశ్వసనీయత ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని స్పష్టం చేశారు.

**మోసం ఎప్పుడూ నిలబడదు :** 2019లో మనం అమలు చేయగలిగే హామీలిచ్చాం. ప్రజలకు గుర్తుండిపోయేలా 2019 మేనిఫెస్టో తెచ్చాం. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయగలరా? అని అడిగారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరతామని ఆనాడు చెప్పా. ఇది చెప్పాం .. ఇది చేశాం అని ఇంటింటికి వెళ్లి చెప్పగలుగుతున్నాం. మన పథకాలతో 87 శాతం పైచిలుకు కుటుంబాలకు సంక్షేమం అందిచాం. కుప్పంలో 93 శాతం కుటుంబాలకు మేలు చేశాం. కుప్పంలో 87 వేల ఇళ్లు ఉంటే 83 వేల ఇళ్లకు మంచి జరిగిందన్నారు. కుప్పంలో 83 వేల కుటుంబాలకు రూ.1,400 కోట్లు ఇచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా బటన్ నొక్కడం, ఏకంగా రూ.2 లక్షల 55 వేల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో జమ చేశాం. మనం చేసిన మంచి చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. 57 నెలల్లో పూర్తి ప్రక్షాళన జరిగింది. సంక్షేమ పాలన అందించాం. గతంలో వెయ్యి రూపాయలు ఉన్న ఫించన్ ను 3 వేలకు చేశామని వివరించారు.

**ఓటర్లకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి :** ప్రతీ బూత్ లో 60 శాతం ఓట్లు సాధించేలా చేయాల్సిన పనులేంటో వారికి స్పష్టంగా చెప్పేసారు. నేతలు ప్రజలకు, ఓటర్లకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సీఎం జగన్ సూచించారు. ముఖ్యంగా పోలింగ్ బూత్ నిర్వహణ , ప్లానింగ్ పై దృష్టి పెట్టాలన్నారు. రాబోయే 45 రోజులు చాలా కీలకమన్నారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అన్నీ పర్యవేక్షిస్తున్నామని నేతలకు సీఎం జగన్ తెలిపారు. మేము సిద్ధం -మా బూత్ సిద్ధం అనుకుంటూ అందరు దీనిపై దృష్టి పెట్టాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఎన్నికల బూత్ లోనూ 60 శాతం ఓట్ల సాధనే లక్ష్యంగా పని చేయాలని నేతలకు జగన్ సూచించారు. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, పార్టీ నుంచి ఆ మేరకు వారికి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

## మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం లో పాల్గొన్న రఫీ, కిషోర్



**కందుకూరు, కలంకౌంటర్ :** సి కె కన్వెన్షన్ మంగళగిరి లో జరుగుతున్న వైఎస్ఆర్సిపి మేము సిద్ధం మా బూత్ సిద్ధం అనే కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు జిల్లా కందు కూరు పట్టణ వైఎస్ఆర్సిపి యువ నాయకులు పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిషోర్ పాల్గొన్నారు.

# దూకుడు పెంచిన టీడీపీ.... సమాధానాలకే పరిమితం అవుతున్న వైసీపీ

● వ్యూహ ప్రతి వ్యూహాలతో దద్దరిల్లుతున్న బాపట్ల రాజకీయం ● కోనా చతురత వర్మ ఉత్సుకత తో రసరమ్యంగా రాజకీయాలు



**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** బాపట్ల రాజకీయం టీడీపీ అభ్యర్థుల ప్రకటన అనంతరం పూర్తిగా మారిపోయింది. వైసీపీ అసమ్మతి నేతలు ఒక్కసారిగా పార్టీ మారుతూ అధికార పార్టీ కి ఝలక్ ఇస్తున్నారు. అధికార పార్టీ లో మాత్రం సమస్యలు ద్వితీయ శ్రేణిలో అర్థం కాని విషయాలు గా మారాయి. బాపట్ల నియోజకవర్గంలో కీలకం అయిన పిట్టలవాని పాలెం మండలంలో ఇరు పార్టీ నేతల్లో అసమ్మతి ఒక ప్రధాన అంశం గా నిలుస్తున్నాయి. వీటిని సఫలీకృతం చేయటానికి ఇప్పటి వరకు ఏ నాయకుడు కదానాయకుని గా మారలేదు. దీనితో క్యాడర్ లో అయోమయం నెలకొంది.అసలు నాయకులు క్యాడర్ పై చిన్నచూపు ఎందుకు చూస్తున్నారు అంటూ చర్చా ఘోస్టులు టి స్టాల్ దగ్గర నడుస్తున్నాయి. ఇదంతా టీడీపీ లో ఒక సమస్య అయితే వైసీపీ లో మాత్రం వర్గ పోరు కొద్ది పాటి మాత్రమే ఉంది. అయితే ఇరు వర్గాలు అధికార పార్టీ నాయకుని చొరవతో మెల్లగా బండిని లాగుతున్నారు. ఈ క్రమంలోనే ఒక తీర్చలేని, మాటిచ్చి నెరవేర్చని సమస్య అధికార పార్టీ ని వెంటాడుతోంది. చేస్తే ఏమి అవుతుంది...,చేయకపోతే ఏమి అవుతుంది అని ఆలోచనలు మొదలు అయ్యాయి. మాట ఇవ్వటం నిలబెట్టుకోవడం అనేది అధికార పార్టీ అగ్ర నాయకుని అలవాటు అంటూ మనం ఎన్నో సభల్లో విన్నాం. కానీ ఇక్కడ మాత్రం ఆ మాట పై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పుడు పిట్టలవాని పాలెం మండలంలో ప్రతిపక్ష నాయకుని సామాజిక వర్గం అధికంగా ఉంది. కానీ కోనా పై అభిమానం తో కొందరు అక్కడి వ్యవస్థను వైసీపీ కి అనుకూలంగా మార్చి కోనా కు తిరుగులేదు అనిపించారు. కానీ ఇప్పుడు వారికి కోనా మాట పై నిలబడతారా లేక ఆయన మాట నీటి మూట అని సందేహం నెలకొంది. ఒక వేళ అన్న మాట ప్రకారం అనుకున్నది జరిగితే ఇక్కడ ఆ సామాజిక వర్గం లో సదరు నాయకుడు పార్టీ లో ఉండి పార్టీ కోసం కష్టపడతారు. అలా కాని పక్షంలో ఆ సామాజిక వర్గం మొత్తం ఏకం అవటం ఖాయం అంటూ ఊహాగానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇరు పార్టీ నాయకుల్లో తీవ్ర భయం క్యాడర్ కు ఎలా సముదాయించాలి అంటూ అర్థం కాని పరిస్థితి లో ఉన్నారు. అంటే కరవమంటే కప్పకు కోపం.. విడవమంటేపాముకు కోపం అన్న చందంగా మారింది ఇప్పటి రాజకీయం. రాబోవు వారం రోజులు కీలకంగా మారాయి. ఏ నాయకుని భవితవ్యం ఏమిటి అని ప్రజలు ఆసక్తి గా ఎదురు చూస్తున్నారు. చూడాలి మాట నిలపడమా!!!రాజకీయం చేయటమా!!!!!

# 29 తేదీన శ్రీ జనార్ధన స్వామి ఆలయంలో నూతన రాజగోపుర కలశ ప్రతిష్ట,ధ్వజస్తంభ ప్రతిష్ట





**కందుకూరు,కలంకౌంటర్ :** శ్రీ స్కందపురి జనార్ధన స్వామి దేవస్థానంలో ఈనెల 29వ తేదీ గురువారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల లోపు నూతనంగా నిర్మించిన రాజగోపురము కలశ ప్రతిష్ట, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట జరుగునని ఆలయ కార్యనిర్వాహణాధికారి బైరాగి చౌదరి, ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం తెలిపారు. ఆలయ అర్చకులు కందుకూరు శ్రీనివాస దీక్షితులు, వెంకట అనంత దీక్షితులు, అనిల్ కుమార్ స్వాముల ఆధ్వర్యంలో శ్రీ జనార్ధన స్వామి వారిని, ప్రసన్నాంజనేయ స్వామి వారిని కన్నుల పండగ గా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ వేద పండితులు వేదాంతం విష్ణు భట్టాచార్యులు, శ్రీధర్ స్వామి వాళ్ల ఆధ్వర్యంలో ప్రతిష్టా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. మంగళవారం పుణ్యాహం, పంచగవ్యారాధన, రక్షాబంధనం,కల్మష హెూమం, ఆక్షిన్మోచనం, పంచగవ్యాధివాసం కార్యక్రమాలు, రాత్రి పుణ్యాహం, అగ్ని ప్రతిష్ట,కలశావాహన, కలశారాధన, ఉక్త హెూమం నిర్వహించి అనంతరంహారతి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నుండి శ్రీ స్కందపురి జనార్ధన స్వామి ఆలయంలో నూతన రాజగోపురం కలశ ప్రతిష్ట, నూతన ధ్వజస్తంభం పునః ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ వేద పండితులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గురువారం రోజు జరిగే నూతన రాజగోపురం కలిశ ప్రతిష్ట, నూతన ధ్వజస్తంభం ప్రతిష్ట లో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 29వ తేదీన ఉదయం 5 గంటల నుంచి ప్రతిష్టా కార్యక్రమాలు మొదలవుతాయని, ఆలయంలో సేవ చేసేవారు ముందుగా తనను సంప్రదించాలని ఆలయ ఈవో భైరవి చౌదరి తెలిపారు. ప్రతిష్టానంతరం సాయంత్రం ఐదు గంటలకు శాంతి కళ్యాణం, వీధి ఉత్సవం, ధ్వజారోహణ జరుగుతుందని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్వామి వారి సేవకులు పాల్గొన్నారు.

# పేదల కోసం పనిచేసే దే టిడిపి, జనసేన సంకిర్ణ ప్రభుత్వం



**పిట్టలవానిపాలెం,(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** బాపట్ల నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి ఎం. ఎల్. ఏ అభ్యర్థి ,జాతీయ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ సంయుక్తంగా కలిసి ఇంటింటికి తెలుగుదేశం మీ మాట - నా బాట, జనసేన టిడిపి జనబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన పార్టీ ఉమ్మడి ఎం. ఎల్. ఏ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామములోని రెడ్ల పాలెం లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులతో కలిసి వెళ్లి టిడిపి, జనసేన ఉమ్మడి మ్యానిమేనిఫెస్టో ను మహిళామణులకు వివరించారు.అనంతరం తన గురించి వివరించే పుస్తకం మరియు చీర, చేతి సంచి ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ... పేదల కోసం పనిచేసే దే టిడిపి, జనసేన సంకిర్ణ ప్రభుత్వమని,రానున్న ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నరు. నీతి, నిజాయితీ తో పని చేస్తానని, మీ అందరికి అందుబాటులో వుంటానని అన్నారు.గ్రామములో వున్న ప్రతి సమస్యలును ప్రజలని అడిగి తెలుసుకొని, అధికారము లోకి రాగానే తీరుస్తానని అన్నారు. వైసిపీ అరాచక పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పకుండా చెపుతారన్నారు.బాపట్ల నియోజకవర్గ టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి ఎం. ఎల్. ఏ అభ్యర్థి గా మీ ముందుకు వస్తున్నానని ప్రజలందరు ఆశీర్వాదించి భారీ మెజారిటీ తో గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, జనసేన సైనికులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం - సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య



**కందుకూరు,కలంకౌంటర్ :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వరం లాంటిదని కొండికందుకూరు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం కొండి కందుకూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్ 2 కార్యక్రమం ఆయన అధ్యక్షతన , ఎంపీడీవో ప్రమీల రాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ దీర్ఘకాలిక, అనారోగ్యంతో బాధపడుతూ ఇతర ప్రాంతాలకు వెళ్ళలేని రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికీ మరియు మా స్థానిక శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డికి దక్కుతుందన్నారు 560 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఎంపీడీవో ప్రమీల రాణి మాట్లాడుతూ కొండికందుకూరు గ్రామంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి సహకారంతో సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య ఒకే చోట సచివాలయం, ఆర్ బి కే, విలేజ్ క్లినిక్ సెంటర్ మరియు పాలకేంద్రం లను గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించటం మరియు ఆహ్లాదకరం ఉట్టిపడేలా సచివాలయ పరిధిలో ఉన్న గుడుల చుట్టూ సిమెంట్ రోడ్డు అరుగుల నిర్మాణం పూర్తి చేయటం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇఓ (పిఆర్ & ఆర్ డి) చంద్రసేన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రషీద్ , స్వప్న , రాంబాబు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది క్యాంపుకు హాజరైన డాక్టర్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ ,గైనకాలజిస్ట్ డాక్టర్ సుగుణ కుమారి,జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ తులసీరామ్,ఆప్తమాలజిస్ట్ మురళీకృష్ణ రెడ్డి మరియు వాలంటీర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కంసాలీలను విశ్వ బ్రాహ్మణులుగా పిలిచేలా ఉత్తర్వులు ఇవ్వాలి

● ఆంధ్ర ప్రదేశ్ బీసీ కమిషన్ చైర్మన్ శంకర నారాయణను కలిసిన ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు



**విజయవాడ,కలంకౌంటర్ :** కంసాలీలను ఇతరులు కులం పేరుతొ దూషించకుండా విశ్వ బ్రాహ్మణులుగా పిలిచేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి, అధికార ప్రతినిధి కిరణ్ విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ బీసీ కమిషన్ చైర్మన్ శంకర నారాయణ , సభ్యులు డాక్టర్ ఎన్. మారేష్ లని మంగళవారం కలిసి వారు ఒక వినతిపత్రాన్ని అందించారు. ఆంధ్రప్రదేశ్ లో వున్నా 25 లక్షల మంది విశ్వ బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా కులదూషణ జరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కుల దూషణ లేకుండా విశ్వ బ్రాహ్మణులుగా పిలిచేలా చట్టం చేయాలని వారు కోరారు.

# మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమానికి హాజరైన పి టి ఆర్,బాలకోటిరెడ్డి




**పొన్నలూరు, కలంకౌంటర్ :** తాడేపల్లి లోని సి కె కన్వెన్షన్ నందు రాష్ట్ర స్థాయి వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేము సిద్ధం మా బూత్ సిద్ధం సమావేశం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సభకు హాజరు అయినా కొండేపి నియోజకవర్గం పొన్నలూరు మండలం కన్వీనర్ పల్లపోలు బాలకోటి రెడ్డి ,జేసిఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతి రెడ్డి, ముత్తంగి మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన సందేశాన్ని తూచా తప్పకుండా పాటించి రాబోవు ఎన్నికల్లో వైయస్సార్సీపి విజయానికి శక్తి వంచన లేకుండా అందరినీ కలుపుకుని కృషి చేస్తామని తెలిపారు.

# 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2

(మొదటిపేజీ తరువాయి)

సాధించాలని సీఎం సూచించారు. ఒక్క బయో సైన్సెస్ లోనే కాదు, ఐటీ-సాఫ్ట్ వేర్, రీసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్ లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. "మీరు నింగిలోని తారల వద్దకు చేరాలని కలలు కంటే.. మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లే రాకెట్ లా మా ప్రభుత్వం పనిచేస్తుంది" అని సీఎం వ్యాఖ్యానించారు. ఇటీవల దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు భారీ స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. ఏటా 5కోట్ల డోసుల వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకేడా సంస్థ ఇక్కడి బయోలాజికల్-ఈ సంస్థతో కలిసి హైదరాబాద్ లో తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు. వైరస్ ల వల్ల ప్రపంచంలో నెలకొన్న భయాలకు హైదరాబాద్ నుంచి నమ్మకాన్ని కల్పిస్తున్నామని సీఎం అన్నారు. జర్మనీకి చెందిన మిల్టేనీ సంస్థ తన రీసెర్చ్ సెంటర్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేసిందని చెప్పారు. మానవాళికి మంచి చేసే చర్చలు, ముందడుగుతో హైదరాబాద్ బయో ఏషియా సదస్సు విజయవంతం కావాలని సీఎం ఆకాంక్షించారు.

# వేమిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన నళినీ దేవి..

● టిడిపి జెండాను ఎగురవేయడమే నా ప్రధాన లక్ష్యం.



**కందుకూరు,కలంకౌంటర్ :** ఏప్రిల్ 2వ తేదీన తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్న రాజ్యసభ సభ్యులు,నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు వేమిరెడ్డి. ప్రభాకర్ రెడ్డిని కందుకూరు నియోజక వర్గానికి చెందిన టిడిపి నాయకురాలు, ఉన్నం రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ ఉన్నం నళినీ దేవి మంగళ వారం నెల్లూరు నగరంలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య కందుకూరు నియోజక వర్గ రాజకీయాల గురించి కొంత సేపు చర్చ జరిగింది. ఈ సందర్భంగా నళినీ దేవి మాట్లాడుతూ రాజకీయ నాయకులకు పదవులు ముఖ్యమేనని, అయితే పదవుల కోసం ప్రాకు లాడకుండా అధిష్ఠానం ఆదేశాల మేరకు పనిచేయాల్సి ఉంటుందని అన్నారు.అదే సమయంలో కందుకూరు నియోజక వర్గంలో గత 20 సంవత్సరాల క్రితం ఎగిరిన తెలుగు దేశం పార్టీ జెండాను మళ్ళీ ఎగిరే విధంగా చేయడమే ప్రస్తుతం తన ముందు ఉన్న ప్రధాన లక్ష్యమని తెలిపారు. గతంలో తాను భారతీయ జనతా పార్టీ తరుపున వివిధ హెూదాలలో 8 సంవత్సరాలు రాజకీయాలలో కొనసాగడం జరిగిందన్నారు. బిజెపి పార్టీ తనకు మంచి క్రమ శిక్షణ, వాక్చాతుర్యం, పెద్దల పట్ల గౌరవం, నమ్ముకున్న సిద్ధాంతాల పట్ల అంకిత భావం వంటి సుగుణాలను నేర్పించిందని వెల్లడించారు. సుమారు అయిదు సంవత్సరాల నుంచి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి, భద్రత, పురోగమనం వంటివి నశించి పోయి, గంజాయి, నాసిరకం మందు, మత్తు పదార్థాలకు నిలయమై పోయిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలకు స్వచ్ఛమైన, స్వేచ్ఛాయుత మైన పాలనను అందించేందుకు టిడిపి - జన సేన పార్టీల ఉమ్మడి భాగస్వామ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నళినీ దేవి కోరారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు.అసెంబ్లీ నియోజక వర్గాలలో ఉమ్మడి అభ్యర్థుల విజయం తథ్యమని, అదే విధంగా నెల్లూరు ఎం.పి.గా వేమిరెడ్డి. ప్రభాకర్ రెడ్డి అత్యధిక మెజారిటీ తో తాము శక్తి సామర్థ్యాలను వినియోగించి పని చేయడం జరుగుతుందని నళినీ దేవి పేర్కొన్నారు.

# మెడికల్ క్యాంప్ ను ప్రారంభించిన ఇంటూరి నాగేశ్వరరావు








**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని 2వ వార్డులో, ఒంగోలు వారి చైతన్య కార్డియాక్ సెంటర్ మరియు స్మార్ట్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెడికల్ క్యాంపును నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. క్యాంప్ నిర్వాహకులు వైఎల్ నారాయణ, సహజానందం, సిబ్బందిని నాగేశ్వరరావు అభినందించారు. ఇలాంటి క్యాంపులు నిర్వహించడం పేద ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.కాలనీవాసులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పొడపాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ విద్యాధరి మర్యాద పూర్వకం గా కలిసిన నళిని దేవి




**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి ని మంగళవారం మర్యాద పూర్వకం గా కలిసిన తెలుగు దేశం నాయకురాలు ఉన్నం నళినీ దేవి.

# రాఘవేంద్రరావు కార్యదక్షతకు కానుక నాఫ్కాబ్ పదవి!

## •చలసాని ఎన్నిక దక్షిణాదికే గర్వకారణం• సన్మానసభలో సహకార యోధ 'మానం' కితాబు



**విజయవాడ, కలంకౌంటర్ :** పాలకపక్షం, ఉద్యోగులు, సభ్యులు కలిసికట్టుగా వుంటే సహకార సంస్థల అభివృద్ధికి ఢోకా వుండదని మాజీ శాసనసభ్యులు, సహకార రంగ యోధ మానం ఆంజనేయులు అన్నారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు సమర్థ నేతృత్వం, నిబద్ధతను చూసి తాను గర్విస్తున్నానని చెప్పారు. విశాఖ బ్యాంకుని దక్షిణ భారతదేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేర్చడంలో రాఘవేంద్రరావు నాయకత్వ పటిమ అబ్బురపరుస్తుందని ప్రశంసించారు. బ్యాంకు వ్యవస్థ మొత్తాన్ని ఒక జట్టుగా ముందుకు నడపడంలో ఆయన సఫలీకృతులయ్యారడానికి ఇదే నిదర్శనమని 30 ఏళ్లపాటు బ్యాంక్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించిన ఆంజనేయులు కితాబిచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ (నాఫ్కబ్)కు ఫిబ్రవరి 12న జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో చలసాని రాఘవేంద్రరావు అఖండ విజయం సాధించడాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం ఉదయం ఘనంగా సన్మానించారు. హెల్త్ వర్సిటీ సమీపంలోని ఎంఎన్ఆర్ లైబ్రరీ హాల్లో వైభవంగా జరిగిన సభకు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, ఫెడరేషన్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర అధ్యక్షత వహించారు.

ప్రత్యేక అతిథిగా మానం ఆంజనేయులు ప్రసంగిస్తూ.. నాఫ్కబ్ డైరెక్టర్ గా రాఘవేంద్రరావు ఎన్నిక ఆషామాషీ విషయం కాదన్నారు. తాను రెండు దశాబ్దాలకు పైగా డైరెక్టర్ గా వున్నా ఫెడరేషన్ తరపున పరోక్ష పద్ధతిలో కొనసాగానని, రాఘవేంద్రరావు విశాఖ బ్యాంక్ ప్రతినిధిగా ప్రత్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించడం దక్షిణాదికే గర్వకారణమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 50 ఓట్లు మాత్రమే వుండగా ఉత్తరాది రాష్ట్రాల ప్రతినిధుల విశ్వాసం కూడా చూరగొని అత్యధికంగా 211 ఓట్లు పొందడం రాఘవేంద్రరావు కార్యదక్షతకు నిదర్శనమన్నారు. సహకార సంఘాలు ప్రజల కోసం పుట్టిన సంస్థలనీ, పరస్పర సహకారంతోనే అవి ముందుకు సాగగలవని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపై ఆధారపడే పరిస్థితి తెచ్చుకోకపోవడం శ్రేయస్కరమని సలహా ఇచ్చారు. బాండ్ల విక్రయం మిషతో ప్రభుత్వాలే నిధుల కోసం సహకార బ్యాంకులపై ఆధారపడుతున్న విషయాన్ని మనం గమనించాలని సూచించారు. ఇటీవలి కాలంలో ఆర్బీఐ విధిస్తున్న నిబంధనలు దుర్మార్గంగా వున్నాయని ఆయన ఆక్షేపించారు. ఆర్బీఐ అధికారులు చెప్పింది చెప్పినట్టుగా మనం ఆచరించామంటే కొంపలు మునుగుతాయని వ్యాఖ్యానించారు. సహకార వ్యవస్థలో సభ్యుల ప్రయోజనాలే ప్రధానమని, ఈ దృష్ట్యా ఆర్బీఐ నిర్ణయాల్లో కొన్నిటిని పట్టించుకోవద్దని, మరికొన్నిటిని ప్రతిఘటించాలని చెప్పారు. అవసరమైతే కోర్టుల్లో కేసులు కూడా దాఖలు చేయాలని ఆయన సూచించారు. సభ్యులకు డివిడెండ్ ఇచ్చే విషయంలోనూ ఆర్బీఐ జోక్యం చేసుకొని జొరబడిందనీ, ఈ విషయంలో సహకార సంస్థలదే అంతిమ నిర్ణయమని ఆంజనేయులు స్పష్టం చేశారు. నాఫ్కబ్ సభ్యుడిగా సహకార అర్బన్ బ్యాంకుల అనేక సమస్యలపై ఇప్పటికే గొంతెత్తుతున్న రాఘవేంద్రరావు ఇపుడు డైరెక్టర్ గా రెట్టించిన బాధ్యతతో పనిచేస్తారనడంలో తనకెలాంటి సందేహం లేదంటూ మానం ఆంజనేయులు శుభాకాంక్షలు తెలిపారు. సభాధ్యక్షులు చిట్టూరి రవీంద్ర మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ని ఉన్నత స్థానంలో నిలిపిన ఖ్యాతి మానం ఆంజనేయులు, చలసాని రాఘవేంద్రరావుకు దక్కుతుందన్నారు. నాఫ్కబ్ డైరెక్టర్ హా రాఘవేంద్రరావు విజయం పోరాడి సాధించుకున్నదనీ, రాష్ట్రం నుంచి వెళ్ళిన ప్రతినిధుల 32 ఓట్లూ గుంపుగుత్తగా సాధించటం ఆయన ఆదర్శ విధానాలకు గొప్ప గుర్తింపు అని చెప్పారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ జిలానీ స్వాగతోపన్యాసమిస్తూ.. విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ను అప్రతిహతంగా విజయవంతంగా నడుపుతున్న రాఘవేంద్రరావు నాఫ్కబ్ డైరెక్టర్ కావడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. అవసరమైనపుడల్లా సలహాలిస్తూ రాష్ట్రంలోని 46 అర్బన్ బ్యాంకులకూ ఆయన పరోక్షంగా చైర్మన్, డైరెక్టర్ పాత్రను పోషిస్తున్నారని అభినందించారు. అయినా అర్బన్ బ్యాంకుల ముందు అనేక సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆర్బీఐ ద్వారా సిబ్బందికి శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నించాలన్నారు.

**సేవాదృక్పథం, నిబద్ధతే విజయరహస్యాలు..** సేవా దృక్పథం, సమాజం పట్ల నిబద్ధతతో సహకార సంఘాలు నడిపితే అవి ఎప్పటికీ విఫలం కావని మనకున్న అనుభవాలు చెబుతున్నాయని సన్మాన గ్రహీత, విశాఖపట్నం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్, నాఫ్కబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు ఉద్ఘాటించారు. ఈ అనుభవాల దిశగా అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీలను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిద్దామన్నారు. 83లో ఆంజనేయులు గారిచ్చిన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సహకార వ్యవస్థతో తనకు అనుబంధం ఏర్పడిందన్నారు. 1993లో ఉద్యోగ సంఘం నాయకుడిగా వుంటూనే బ్యాంకు డైరెక్టర్ గా ఎన్నికయ్యానన్నారు. మొదట ఉద్యోగిగానే కాక కార్మిక సంఘాల నిర్వహణలో బాధ్యతలు నిర్వహించానని, సంఘానికి అధ్యక్షునిగా వీరోచితమైన అనేక పోరాటాల్లో పాల్గొన్నానన్నారు. పెద్దలు ఆంజనేయులు తొమ్మిది రోజులు నిరాహార దీక్ష చేస్తే అరెస్టు చేశారనీ, ఆ పోరాటాన్ని కొనసాగించే బాధ్యతను నిర్వర్తించానని చెప్పారు. అనేక కార్మిక పోరాటాలలో భాగస్వామిగా వుండటం ఒక పాత్ర అయితే సహకార రంగంలో యాజమాన్యంలో వుండటం మరో పాత్ర అని తెలిపారు. ఈ రెండూ విరుద్ధమైనవిగా కనబడుతున్నప్పటికీ కొన్ని సామీప్యతలు కూడా ఈ బాధ్యతల్లో ఉన్నాయన్నారు. నిజానికి పదవులు అనేది మనం చూసే కోణాన్ని బట్టి ఉంటుందనీ, ఎవరైనా పదవి అని భావిస్తే అది న్యాయమైంది కాదేమోననిపిస్తుందన్నారు. పదవి అనేది ఒక బాధ్యతతో కూడుకున్నదనీ, ఆ బాధ్యత నిర్వర్తించడంలోనే దానికి గౌరవం వస్తుందని రాఘవేంద్రరావు స్పష్టం చేశారు. వ్యక్తికి గౌరవం వస్తుందితప్ప పదవి ఉన్నంత మాత్రంచేత ఒక వ్యక్తి గౌరవం పెరుగుతుందని తాను అనుకోవడం లేదన్నారు. నాఫ్కబ్ డైరెక్టర్ గా ఎన్నిక కావడం ఒక గౌరవప్రదమైనదే అయినా ఇది ఒక బాధ్యతతో కూడుకున్నదన్నారు. ఇక్కడ చాలామంది వక్తలు మనందరి సమస్యల పరిష్కారానికి ప్రతినిధిగా ఏదో చేయాలనే ఆశను, ఆకాంక్షను వ్యక్తం చేశారనీ, ఇది తానొక్కడి చేతిలో వుంటుందని అనుకోవడం లేదన్నారు. మీ అందరి సహకారంతోనే అక్కడ నా గళం వినిపించగలనని చెప్పారు. కోఆపరేటివ్ స్థాయిలో, బ్యాంకుల స్థాయిలో తప్పుచేసి దాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం సహకరించాలంటే అది సాధ్యమవుతుందని తాను అనుకోవడం లేదన్నారు. మనకేం కావాలో స్పష్టత వుండాలని, అలా మన వ్యవస్థ పటిష్టతకు కృషిచేద్దామని చెప్పారు. సొసైటీలు, బ్యాంకులను సమర్థవంతంగా నడుపుకోవాలని, ఏమైనా ఇబ్బందులొస్తే సలహాలు, సూచనలు ఫెడరేషన్ ద్వారా పొందుదామని చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటకలో మెరుగైన పద్ధతులున్నాయని, వాటిని మన చట్టాల్లో కూడా తీసుకురావడానికి ఒక ప్రయత్నం చేయగలిగితే మనకున్న ఇబ్బందులు అధిగమించడానికి అవకాశం వుంటుందని చెప్పారు. ఇక్కడ అభినందన సభ ఏర్పాటు చేసి ఇంతమంది అనేక ప్రాంతాల నుంచి వచ్చి అభినందనలు తెలిపిన మిత్రులందరికీ సదా కృతజ్ఞతలని చెప్పారు. వ్యవస్థ పటిష్టతకు తనవంతు పాత్రను నాఫ్కబ్ డైరెక్టర్ గా శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని రాఘవేంద్రరావు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన నాఫ్కబ్ సభ్యులు ఈ సందర్భంగా రాఘవేంద్రరావును శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాణి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎం వెంకటరత్నం, ఇన్నిస్ పేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కేఏ రామారావు, జాంపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బి జయకుమార్, గాంధీ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వి వెంకటరావు, కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కె రాంబాబు, పొద్దుటూరు కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వై కుమార్ రెడ్డి, గుంటూరు కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బి శ్రీనివాస రావు, సీఈఓ సదానంద్, గుంటూరు మహిళా కోఆపరేటివ్ బ్యాంక్ చైర్ పర్సన్ కె వాణి సుజాత, స్వశక్తి మర్కంటైల్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జివి రామారావు, పీపుల్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ ఎ ఎల్లారావు, కాకతీయ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ డివిల్ కాంతారావు, సీఈఓ ఝాన్సీలక్ష్మి, ఫెడరేషన్ డైరెక్టర్ ఎస్ రవీంద్ర కుమార్, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ అధికారి జగన్నాథ్ రెడ్డి, కాకినాడ కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణ, కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎన్ రంగబాబు, సహకారభూమి జర్నల్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్ దాసరి కేశవులు, సెక్రటరీ వీరమాచనేని రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీకి సోషల్ మీడియా వెన్నుముక లాంటిది

## • వైఎస్ఆర్సీపీ నరసరావుపేట పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్





**నరసరావుపేట,కలంకౌంటర్ :** నరసరావుపేట పట్టణంలో పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వైఎస్ఆర్సీపీ నరసరావుపేట పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ పి అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నలుమూలల నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్టీకి సోషల్ మీడియా వెన్నుముక లాంటిది సోషల్ మీడియా ప్రభావం ఈ మధ్యకాలంలో బాగా పెరిగిందని, మీ అందరి కృషితో పల్నాడు జిల్లాలో 7 కి 7 స్థానాలు, పార్లమెంటు స్థానం కూడా గెలిపించుకోవాలన్నారు.

# ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది

## • రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి





**హైదరాబాద్,కలంకౌంటర్ :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజల నుండి అందే ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతఇస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా పర్యవేక్షించటానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డిని ప్రభుత్వం నియమించింది. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నా రెడ్డి పర్యవేక్షించారు. ప్రజావాణికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ, ఉపాధి కల్పనకై అధిక సంఖ్యలో విజ్ఞాపనలు వస్తున్నందున వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ వర్గాల నుండి ప్రజలు తమ సమస్యలను ఆయనకు తెలియజేశారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 1869 దరఖాస్తులందాయి. రెవెన్యూ , పోలీస్ , మున్సిపల్ , పౌరసరఫరాల శాఖ, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ, ఉపాధి, విద్య, ఎస్సీ, ఎస్టి, బి.సి, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, పరిశ్రమలు, అటవీ, విద్యుత్, నీటిపారుదల, దేవాదాయ తదితర పలు శాఖలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు తమ అర్జీలను అధికారులకు అందచేస్తున్నారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, సిడియంఎ దివ్య, ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడానికి ప్రజాభవన్ లో 16 కౌంటర్లు ఏర్పాటు చేసి. ఆ దరఖాస్తులను తగు చర్య నిమిత్తం సంబంధిత శాఖలకు పంపిచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# జిల్లాస్థాయిలో ఎస్ఎమ్ఆర్ విద్యా సంస్థల విద్యార్థుల ప్రతిభ



**గోకవరం,కలంకౌంటర్ :** ఇటీవల రాజమహేంద్రవరం జూబ్లీ మెమోరియల్ స్కూల్లో నిర్వహించిన అబాకాష్ జిల్లాస్థాయి కాంపిటీషన్ విశ్వం ఎడ్యుటిక్ వారు నిర్వహించిన మ్యాథమెటిక్స్ పోటీ పరీక్షలలో గోకవరం మండలంలోని గోకవరం, తంటికొండ గ్రామాలలో ఎస్ ఎన్ ఆర్ విద్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని జిల్లాస్థాయిలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచి ప్రతిభను చాటుకున్నారని మంగళవారం ఎస్ ఎం ఆర్ విద్య సంస్థల కరస్పాండెంట్ ఎస్ ఆర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం జరిగిందని వారిలో మా పాఠశాల నుండి ఐదు మంది విద్యార్థులు 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు ఐదు ర్యాంకులు ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాల సాధించడం గర్వపడుతున్నానని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు టి విజయ రాజ్ కుమార్, ఆకుల పూజిత, నేమాల ప్రవల్లిక, కాసుమళ్ల మనోజిక, గండిపూడి రాజీలను పాఠశాల కరస్పాండెంట్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

# వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, శ్రీ వాసవి కళ్యాణ సదన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనండి - దేవకి



**కనిగిరి, కలంకౌంటర్ :** కనిగిరి పట్టణంలో ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటల 49నిం లకు కనిగిరి బొడ్డుచాగుడి వద్ద ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా అమ్మవారి ఆలయ శంకుస్థాపన, శ్రీ వాసవి కళ్యాణ సదన్ శంకుస్థాపన జరుగునని ఆలయ గౌరవాధ్యక్షులు, వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ ప్రెసిడెంట్ దేవకి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కొలిపర్తి వెంకటస్వామి, కోశాధికారి బచ్చు రమేష్ ఆధ్వర్యంలో ప్రతిష్ట కార్యక్రమం జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమానికి తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామిజీ , చైతన్య తపోవన శివ కేశవ పీఠం స్థాపకులు పూజ్య శ్రీ మాతాజీ శివానంద సరస్వతి, శ్రీ విద్యాపీఠం పీఠాధిపతి శ్రీ ప్రజ్ఞా సరస్వతి స్వామీజీ, సిద్ధ జ్ఞాన ఆశ్రమం పీఠాధిపతి శుద్ధ చైతానంద స్వామీజీ చేతులు మీదుగా శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగునని దేవకి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం అత్యంత అద్భుతంగా సుందరంగా రాతి కట్టడంతో నిర్మాణాన్ని తలపెట్టినామని, ఈ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన దాతలు, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి భక్తులు, కనిగిరి పట్టణ ఆర్య వైశ్యులు అందరూ ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవకి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

# ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు

## • సాలూరు టౌన్ లో హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో నారా భువనేశ్వరి



**సాలూరు,కలంకౌంటర్ :** గిరిజన సోదర, సోదరీమణులకు వైద్య సేవలు అందించడం చాలా ఆనందంగా ఉందని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. ఉత్తరాంధ్రలో నిజం గెలవాలి పర్యటనకు వెళుతూ మార్గం మధ్యలో సాలూరు పట్టణంలో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ ను భువనేశ్వరి మంగళవారం ప్రారంభించారు. అనంతరం క్లినిక్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్లినిక్ లో ఏర్పాటు చేసిన వైద్య సదుపాయాలను భువనమ్మ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్లినిక్ మొత్తం పరిశీలించి ఏర్పాట్లపై సంతోషం వ్యక్తి చేశారు. సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరికి వైద్యసేవలను అందించాలని క్లినిక్ సిబ్బందికి సూచించారు. అనంతరం భువనేశ్వరి విలేకరులతో మాట్లాడుతూ నా గిరిజన అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు ఉన్న ఈ సాలూరు ప్రాంతంలో సంజీవనీ క్లినిక్ ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో నేటికీ వైద్యం అందక గిరిజనులు పడుతున్న ఇబ్బందులను మనం చూస్తున్నాం. సాలూరు ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతోనే ఈ క్లినిక్ ను ప్రారంభించడానికి కారణం. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా 27ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉచిత విద్య, వైద్యం తెలుగు ప్రజలకు అందిస్తూ సేవలు అందిస్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్టు నుండి 3 బ్లడ్ బ్యాంక్ కేంద్రాలు నిర్వహిస్తున్నాం. వీటి నుండి ఇప్పటి వరకు 8లక్షల మంది ప్రజలకు రక్తాన్ని ఇచ్చి కాపాడాం. 81,361 యూనిట్ల రక్తాన్ని నిరుపేదలకు ఉచితంగా అందించాం. 19,956 యూనిట్ల రక్తాన్ని తలాసేమియా బాధితులకు ఉచితంగా అందించాం. 57,652 యూనిట్లు రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా అందించాం. సంజీవని క్లినిక్స్ ద్వారా 67,104 కుటుంబాలు లబ్ధి పొందాయి. ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా 33,681 కుటుంబాలు నేటికి వైద్యసేవలు పొందాయి. పాకాల, పాలకొండ, పోలవరం, కురుపాం, పాడేరు, రంపచోడవరం, అరకు ప్రాంతాల్లో ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్టు నుండి వికలాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్లు, కృత్రిమ కాళ్లు అందించాం. తిరుపతి, నెల్లూరు, కడపలో వరదలు వచ్చిన సమయంలో ఇళ్లు కూలిపోయిన 175 మంది బాధితులకు ఇంటి మరమ్మతులు కోసం ఒక్కో ఇంటికి రూ.5వేలు ఆర్థికసాయం అందించాం. వరద సమయంలో మృతిచెందిన 48మంది బాధిత కుటుంబాలలో ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థికసాయం అందించాం. కేరళలో వరదలు వచ్చిన సమయంలో రూ.10లక్షలు విలువైన నోట్ బుక్స్, రూ.20లక్షలు విలువైన మెడిసిన్స్ అందించాం. కరోనా కష్టసమయంలో రూ.1.5కోట్ల రూపాయలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 3 ఆక్సిజన్ ప్లాంట్లు నెలకొల్పాం. రూ.2.75లక్షల విలువైన మాస్కులు అందించాం. 20వేల కుటుంబాలకు కరోనా క్లిష్ట పరిస్థితుల్లో ఉచితంగా నిత్యావసర వస్తువులు, ఫుడ్ ప్యాకెట్లు, మెడిసిన్స్ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా పంపిణీ చేశాం. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా స్కూళ్లు నడుపుతూ 1,938 మందికి ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నాం. రూ.3.44కోట్లతో పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందిస్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా రెండు క్లస్టర్లలో మూడు పెద్ద వాటర్ ప్లాంట్లు పెట్టి 3.5లక్షల మంది జనాభాకు సురక్షిత మంచినీరు అందిస్తున్నాం. ఎన్టీఆర్ పేదల పట్ల సంకల్పించిన సేవా కార్యక్రమాలను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా నెరవేరుస్తున్నాం. సాలూరు పట్టణ ప్రజలు ఎన్టీఆర్ హెల్త్ క్లినిక్ ను సద్వినియోగం చేసుకుని, వైద్య సేవలు పొందాలని కోరారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com